ప్రజాశక్తి
సోమవారం 13 మార్చి 2023
5
విజయనగరం



పోలింగ్ రోజే ప్రశ్నపత్రాల తరలింపా?

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజే ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలను తరలించడం దుర్మార్గమని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మండిపడ్డారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ చర్యల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రశ్నపత్రాల తరలింపు వాయిదా వేయాలని అధికారులను కోరామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను డబ్బుతో కొనాలని అధికార పార్టీ భావించడం సిగ్గుచేటన్నారు. ఓడిపోతామనే భయంతోనే వైసిపి నాయకులు ఇదంతా చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- 72 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జిల్లాలో 58,502 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- ఫిర్యాదుల కోసం వాట్సాప్ నంబరు 8333813468

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ స్థానం కోసం మొత్తం 37 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. దీనికోసం జిల్లాలో 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఓటర్లందరికీ బిఎల్‌ఒల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తిచేశారు. పోలింగ్ కేంద్రం సమీపంలో కూడా ఓటరు స్లిప్పులు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఓటరు స్లిప్పుతోపాటు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని ఓటర్లు తీసుకురావాల్సి ఉంది. పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో అంకెల ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది. కలెక్టరేట్ కంట్రోల్ రూము నుంచి ఎన్నికల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి పర్యవేక్షించారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి దీపికా పాటిల్ పర్యవేక్షిస్తున్నారు.



పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్తున్న అధికారులు, సిబ్బంది



ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్‌కు వివరిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి-విజయనగరం

ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాను 13 జోన్లుగా విభజించి 13 మంది జోనల్ అధికారులను నియమించారు. దీంతోపాటు 13 రూట్లుగా విభజించి 24 మంది రూట్ అధికారులను నియమించారు. పర్యవేక్షణ నిమిత్తం ఎన్నికల సంఘం 72 మంది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లగా నియమించింది. వీరికి అదనంగా మరో 18 మంది రిజర్వు అబ్జర్వర్లను కూడా ఏర్పాటుచేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాకు 229 పెద్ద సైజు బ్యాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సరఫరా చేసింది. వీటికి అదనంగా మరో 100 రిజర్వు బ్యాలెట్ బాక్సులు కూడా అందించింది. ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

విజయనగరంతోపాటు చీపురుపల్లి, బొబ్బిలి డివిజన్ కేంద్రాల్లో కూడా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బందికి, ఎన్నికల సామగ్రిని, బ్యాలెట్ బాక్సులను, పత్రాలను అందజేశారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రి తీసుకొని తరలివెళ్లారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేకంగా 15 ఆర్‌టిసి బస్సులను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

72 కేంద్రాలు.. 58,502 మంది ఓటర్లు

జిల్లాలో 58,502 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారు. వీరికోసం జిల్లా యంత్రాంగం 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. విజయనగరంలోనే 20 పోలింగ్ కేంద్రాలున్నాయి. మొత్తం ఓటర్లలో 38,625 మంది పురుషులు, 19,868 మంది మహిళలు, 9 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉన్నారు.

డివిజన్	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
విజయనగరం	42	33,643
బొబ్బిలి	13	10,603
చీపురుపల్లి	17	14,256

ఫిర్యాదుల కోసం..

పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు జిల్లా పరిషత్ సిఇఒ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రెండు గంటలకు నమోదైన ఓట్లను తెలుసుకోవడంతోపాటు ఆయా కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న విధానం, ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయిందీ, లేనిదీ వంటి సమస్యలు కూడా తెలుసుకుంటారు. జిల్లా కలెక్టర్ ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే ఎన్నికల పర్యవేక్షణ చేస్తారు. ఫిర్యాదుల స్వీకరణ కోసం వాట్సాప్ నెంబరు 8333813468 ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. 72 కేంద్రాల్లోనూ సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్ జరుగుతున్న తీరును జిల్లా కేంద్రం నుంచి జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి
కలెక్టర్ సూర్యకుమారి

గ్రాడ్యుయేట్ ఓటర్లంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ సూర్యకుమారి ఆదివారం సందర్శించారు. అనంతరం కలెక్టరేట్ కంట్రోల్ రూం నుంచి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షించారు. ఎక్కువ పోలింగ్ బూత్‌లు ఉన్న కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని కలెక్టర్ చెప్పారు. ఓటర్లు పోలింగ్ బూత్‌లోకి వెళ్లేముందే, తమ ఓటును ఎవరికి వేయాలో నిర్ణయించుకోవాలని, దీనివల్ల ఓటింగ్ ప్రక్రియ త్వరగా జరుగుతుందని సూచించారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిరంతరాయంగా ఓటింగ్ జరుగుతుందని, వీలైనంత వరకు ఓటర్లు ఉదయమే వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటు వేయక ముందుగానీ, వేసిన తరువాత గానీ, ఏ అభ్యర్థికి ఓటు వేస్తున్నదీ లేదా ఓటు వేసిన విషయాన్ని బయటకు వెల్లడించకూడదని స్పష్టం చేశారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే, 8333813468 వాట్సాప్ నంబరుకు పంపించాలని కలెక్టర్ సూచించారు.

కోరెడ్ల రమాప్రభకే నా ఓటు

- ఎమ్మెల్సీ ఓటింగ్ వేళ పట్టభద్రుల మనోగతం
- వైసిపి, టిడిపిలను చీదరించుకుంటున్న వైనం
- ఉత్తరాంధ్రా ద్రోహి బిజెపి



'ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకే నా ఓటు. ఎందుకంటే వైసిపి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసింది. గత చరిత్ర రీత్యా అటు టిడిపినీ విశ్వసించలేం. ఆ పార్టీల తరపున పోటీచేసే అభ్యర్థులకు ఓటేస్తే మన కళ్లు మనం పొడుచుకున్నట్టే!. అందుకే ప్రజాసేవకు అంకితమైన రమాప్రభకు ఈసారి ఓటేద్దామని డిసైడ్ అయ్యాను' ఇదీ సగటు ఓటర్లలో ఎక్కువ మంది నోట వినిపిస్తున్న మాట. రమాప్రభ గెలిచి తీరుతారన్న ఒకింత ధీమా కూడా ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నాడి.. ఎక్కువ మంది కోరెడ్ల రమాప్రభకు అనుకూలం గానూ, టిడిపి, వైసిపి అభ్యర్థులకు వ్యతిరేకం గానూ వినిపిస్తోంది. చాలా చోట్ల టిడిపి, వైసిపి అభిమానులు సైతం రెండో ప్రాధాన్యత ఓటు రమాప్రభకే వేస్తామని చెప్పడం గమనార్హం.

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

వైసిపికి ఓటు వేస్తే మరోసారి మోసపోయినట్టే!

'వైసిపి అభ్యర్థికి ఎందుకు ఓటు వేయాలి? ఈ నాలుగేళ్లుగా ప్రభుత్వం వల్ల ఒరిగిందేమీ లేదు. ఆర్థిక మోసం, వత్తిపరమైన వేధింపులు, బదుల మూత, నిరుద్యోగులకు జాబ్ లెస్ కేలండర్ తప్ప! ఏముంది పాలనలో..?, ఇలాంటి సమయంలో వైసిపికి మరో అవకాశం ఇస్తే మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తుంది.' ఇదీ ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాట.

టిడిపికి, వైసిపికి తేడా లేదు

'ఇప్పుడు టిడిపి అభ్యర్థిని గెలిపిస్తే... ప్రతిపక్షంగా ఉన్న టిడిపి కళ్లు నెత్తికెక్కవన్న గ్యారెంటీ లేదు. గతంలో టిడిపి ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలే అమలు చేసింది. విధాన పరంగా వైసిపి, టిడిపిల మధ్య తేడా ఏమీ లేదు. జెండాలు మారినా అజెండా ఒక్కటే. విద్యారంగాన్ని సర్వనాశనం చేసి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే జాతీయ నూతన విద్యావిధానం అమలు, సిపిఎస్ రద్దు, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో అత్యంత కీలకంగా ఉన్న స్టీల్‌ప్లాంట్, తదితర ప్రభుత్వ రంగ పరిశ్రమల విక్రయం, విభజన హామీ అమలుపై బిజెపిని ప్రశ్నించకపోవడంలోనూ ఈ విషయం స్పష్టంగానే అర్థమైంది. ఈ నేపథ్యంలో టిడిపి తరపున గెలిచే అభ్యర్థి ఉద్యోగ, నిరుద్యోగ, ఉపాధ్యాయుల పక్షంగా కనీసం మాట్లాడే నైతికత ఉండదు.' ఇదీ ఉత్తరాంధ్రలోని పాలకపక్ష పార్టీల పట్ల విసిగిపోయిన ఓటర్ల మాట.

ఉత్తరాంధ్రకు అన్యాయం చేసిన బిజెపి

'రాష్ట్రానికి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు బిజెపి తీవ్ర అన్యాయం చేసింది. నిరుద్యోగులను మోసం చేసింది. రైతులను దగా చేస్తోంది. ఓవైపు దేశభక్తి అంటూనే ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా విదేశీ బహుళ జాతి సంస్థలకు విక్రయిస్తోంది. విభజన హామీల్లో ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయలేదు. ఇటువంటి పార్టీ తరపున గతంలో గెలుపొందిన అభ్యర్థి వీటిపై కనీసం నోరుమెదపలేదు. ఇప్పుడు ఓట్లు అడుక్కుంటే ఎలా నమ్మగలం?' ఇదీ బిజెపి బండారం తెలిసిన ఓటర్ల మాట.

కోరెడ్ల రమాప్రభకే మద్దతు

'అసలు ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం అంటూ ఉందంటే.. అది శాసనమండలిలో పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్) మాత్రమే. ఉద్యోగ, నిరుద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు ఇలా ఒకటేమిటి? పాలకపార్టీలు అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక, కర్షక, వ్యాపార, వాణిజ్య విధానాలపై నిఖార్సుగా నిలదీస్తున్నారు. ప్రజల గొంతై పనిచేస్తున్నారు. పాలకుల కల్లబొల్లి మాటల్ని బట్టబయలు చేస్తున్నారు. నీతి, నిజాయితీకి మారుపేరుగా పనిచేస్తున్నారు. అంతెందుకు.... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి సభ్యులందరికీ హైదరాబాద్ నడిబొడ్డున గచ్చిబౌలిలో ప్రభుత్వం తరపున మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను సున్నితంగా తిరస్కరించిన నిస్వార్థపరులు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు. వారు బలపర్చిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభకే మా ఓటు.' ఇది మెజార్టీ ఓటర్ల మనోగతం.

వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాలీబాల్ అసోసియేషన్ విజయనగరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జి.సూరిబాబు, కార్యదర్శిగా కెవిఎఎన్ రాజు, కోశాధికారిగా కె.సన్యాసి నాయుడుతోపాటు మరో 23 మందితో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం సిటీ క్లబ్‌లో పూర్వ అధ్యక్షులు కృష్ణంరాజు అధ్యక్షతన జిల్లా వాలీబాల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యదర్శి నివేదికను జిల్లా పూర్వ కార్యదర్శి భగవాన్ దాస్ ప్రవేశపెట్టారు. అనంతరం ఏకగ్రీవంగా 25 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ప్రసాద్‌రాజు మాట్లాడుతూ విజయనగరం జిల్లా వాలీబాల్ జట్టుతో ఆడాలంటే రాష్ట్రంలో అన్ని జట్లు ప్రణాళిక లేకుండా తలపడే పరిస్థితి లేదన్నారు. ఆ స్థాయికి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ తీసుకెళ్లడం జిల్లాలో ఉన్న వాలీబాల్ ప్రేమికుల సహకారం వల్లే సాధ్యమన్నారు. అనంతరం అనేక ఏళ్లపాటు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఉంటూ బాధ్యతల నుంచి రిలీవ్ అయిన కృష్ణంరాజు, భగవాన్ దాస్‌ను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు.



వాలీబాల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

సమావేశంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శ్రీనివాసరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎన్.వెంకటనాయుడు, సిఐ బాలకృష్ణ, కనకల కృష్ణ, సాంబ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు అంకెలతోనే ఓటు

ప్రజాశక్తి-విజయనగరం



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలో జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ విధానం సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా ఉంటుంది. ఈ ఎన్నికలకు అభ్యర్థులకు ఎదురుగా బ్యాలెట్ పేపర్‌పై గుర్తులు ఉండవు. అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఓటరు పేరుకు ఎదురుగా అంకెతోనే ఓటు వేయాలి. ఓటరు ప్రాధాన్యతా క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేయొచ్చు. ఓటు ఎలా వేయాలి, ఎలా వేయకూడదనే అంశాలను పొందుపరస్తూ అవగాహన కలిగించడానికి ఎన్నికల కమిషన్ పోస్టర్‌ను రూపొందించింది.

ఓటు ఎలా వేయాలి

- ☑ మీకు ఇచ్చిన బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి.
- ☑ మీరు మొదట ప్రాధాన్యం ఇచ్చే వారికి అభ్యర్థుల ఎదురుగా 1, 2, 3 నంబర్లు లేదా రోమన్ అంకెలు వేయాలి.
- ☑ పోలింగ్ కేంద్రాల్లో ఇచ్చే పెన్ మాత్రమే వాడాలి.
- ☑ ఓటు వేసేందుకు వెళ్లేటపుడు మీ ఐడి ప్రూఫ్ తీసుకొని వెళ్లాలి.
- ☑ బూత్ లోపలకు వెళ్ళే ముందు మీ పేరు చూసుకుని సంతకం పెట్టాలి.
- ☑ కేంద్రం బయట ఓటర్ లిస్టులో మీ పేరు, క్రమ సంఖ్య చూసుకోండి.

ఎలా వేయకూడదు


- ☒ మీ సొంత పెన్ వాడకూడదు.
- ☒ ఒకే నంబర్ ఇద్దరు అభ్యర్థులకు ఇవ్వకూడదు.
- ☒ 'ఒకటి', 'వన్' అని రాయకూడదు.
- ☒ బ్యాలెట్ పేపర్‌లో ఎక్కువ పేర్లు ఉంటాయి, ఆ పేర్లలో మీకు నచ్చిన వారికి '1' నంబర్ వెయ్యాలి.
- ☒ బ్యాలెట్ పేపర్ వారు చెప్పే పద్ధతుల్లో ఫోల్డ్ చేసి వేయకపోతే ఇన్‌వాలిడ్‌గా తీసుకుంటారు.
- ☒ మీరు ఇచ్చే నంబర్స్ గట్టిగా పెన్‌తో రుద్దరాదు.
- ☒ అభ్యర్థి పేరు, బాక్స్ పక్కన కాకుండా మరే ఇతర ప్రదేశాలలో వేసినా ఓటు చెల్లదు.
- ☒ '1' వేయకుండా మిగతా నంబర్లు వేస్తే ఓటు చెల్లదు.
- ☒ అభ్యర్థులు ఎక్కువ ఉంటే అందరికీ ఓటు వేయాల్సిన అవసరం లేదు. ఉదా : 70 మంది ఉంటే అందరికీ అవసరం లేదు. ప్రాధాన్యతలో కొందరికి వేస్తే సరిపోతుంది.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 15 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరిగే ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మజ్జి సత్యనారాయణ వెల్లడించారు. 78 కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టంచేశారు. ఈ వారం 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లు గురించి ఆయన వివరించారు. ఆ వివరాలు..

– ప్రజాశక్తి, విజయనగరంటౌన్





- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- 78 కేంద్రాల్లో నిఘా నీడలో పరీక్షలు
- హాజరుకానున్న 48,118 మంది విద్యార్థులు
- 'ప్రజాశక్తి'తో ఆర్‌ఐఒ ఎం.సత్యనారాయణ ముఖాముఖి

? ఇంటర్ పరీక్ష సమయం ఎన్ని గంటలు? సమయం వెసులుబాటు ఉందా?.

ఈ నెల 15న ఇంటర్ మొదటి సంవత్సర, 16 నుంచి ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమై, ఏప్రిల్ నాలుగో తేది వరకు జరగనున్నాయి. ఇప్పటికే ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులకు ఎటువంటి అదనపు సమయమూ లేదు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించరు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలి.

? ఎన్ని కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు?.

ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాతిపదికన పరీక్షలు నిర్వహిస్తున్నాం. మొత్తం 78 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. వీటిలో 42 ప్రయివేటు, 36 ప్రభుత్వ కళాశాలల కేంద్రాలున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులు 24,463, ద్వితీయ ఇంటర్‌లో 23,655 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

? కేంద్రాల వద్ద తీసుకున్న చర్యలు?.

ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, లైటింగ్, మరుగుదొడ్లు, మంచినీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నాం. ఆయా శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే రెండు సార్లు అన్ని పరీక్ష కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసుకునే విధంగా చర్యలు తీసుకున్నాం.

? మాల్ ప్రాక్టీస్ నివారణకు తీసుకున్న జాగ్రత్తలేమిటి?.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత చర్యలతోపాటు అన్నిచోట్లా సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న షాపులు, జెరాక్సు సెంటర్లను మూసివేయాలి. ఈవిషయంపై ఇప్పటికే కేంద్రాల వద్ద ఉన్న షాపుల యజమానులకు చెప్పాం. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు, సిబ్బంది, పోలీసులు, మెడికల్ సిబ్బంది కూడా సెల్‌ఫోన్లు నిషేధించాం. ఎలక్ట్రానిక్ పరికరాలు ఎవరూ తీసుకెళ్లొద్దని ఆదేశించాం.

? పరీక్షల నిర్వహణకు ఎంతమంది సిబ్బందిని నియమించారు?.

పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లు 1500 మందిని నియమించాం. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 10 సిట్టింగ్ స్క్వాడ్లు, 78 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను నియమించాం.

? ఫీజులు కట్టలేదని హాల్‌టికెట్లను ప్రయివేటు విద్యాసంస్థలు ఇవ్వడం లేదని వస్తున్న ఫిర్యాదులపై మీ స్పందనేమిటి?.

ఏ ప్రయివేటు కళాశాలలోనైనా ఫీజులు కట్టలేదని హాల్ టికెట్లు ఇవ్వకపోతే వెంటనే మా కాల్‌సెంటర్‌కి, లేకుంటే నా నంబర్‌కు ఫోన్ చేయాలి. హాల్ టికెట్లు ఇవ్వని కాలేజీలపై చర్యలు తీసుకుంటాం. అటువంటి ఇబ్బందులుంటే 08922-237988, 9392911825 నంబర్లను సంప్రదించాలి.

ఓటు హక్కు వినియోగానికి కార్మికులకు అనుమతి

ప్రజాశక్తి-విజయనగరం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలు, ప్రయివేటు విద్యా సంస్థలలో పనిచేస్తున్న గ్రాడ్యుయేట్ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించినట్లు డిసిఎల్ ఎన్.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సంస్థల యజమానులు వారి పనివార్లలో పట్టభద్రులైన ఓటర్లకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య వారి ఓటు హక్కును వినియోగించుకొనేలా సమయం ఇవ్వాలని సూచించారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం

వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం కోలగట్ల నివాసంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ వైసిపిలో ఉండడం వల్ల పదవులు పొందామన్న విషయాన్ని గుర్తించుకోవాలని పార్టీ శ్రేణులకు చెప్పారు. వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన ఆవిర్భావ వేడుకలలో మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతిదేవి, పార్టీ జోనల్ ఇన్‌ఛార్జులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అవనాపు విక్రమ్ ఆధ్వర్యంలో..

వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కళ్లల్లో ఆనందం చూడాలన్న లక్ష్యంతో ఏర్పడిన పార్టీ వైసిపి అన్నారు. మళ్లీ జగన్‌ను సిఎంను చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జి.కృష్ణంరాజు, వి.గురుమూర్తి, సంపత్ రాజు, భీమ్‌సింగ్, ముని లక్ష్మణరావు, ఎర్నింటి నర్సింగరావు, రాంబాబు, కాదర్, వంకర శ్యామ్, గౌతం పాల్గొన్నారు.



వైసిపి జెండాను ఎగురవేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



ఎమ్మెల్యేకు వినతి పత్రమిస్తున్న మాజీ సైనికులు

ఎమ్మెల్యేకు మాజీ సైనికుల వినతి

బొబ్బిలి: వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు రెడ్డి దామోదరరావు ఆధ్వర్యంలో బొబ్బిలి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమ భవనానికి బొబ్బిలిలో స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు మాట్లాడుతూ సరిహద్దుల్లో దేశ భద్రత కోసం అహర్నిశలు పోరాడి పదవి విరమణ చెందిన తరువాత మాజీ సైనికులుగా తమకంటూ దేశ భక్తి వ్యక్త పరచడానికి, సైనిక కార్యకలాపాలు నిర్వహించడానికి ఓ ప్రత్యేక భవనం నిర్మాణ కోసం స్థలం కేటాయించాలని కోరారు. గతంలో మిలిటరి కాలనీ తమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారని, ఇప్పుడు కూడా తమను, భావితరాలను దృష్టిలో పెట్టకుని స్థలం కేటాయించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం తమ సమస్యను తీర్చేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విచ్చలవిడిగా మట్టి తరలింపు



అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

వేపాడ : మండలంలోని ఓబలయ్య పాలెం, సోంపురం, నల్లబెల్లి, కె ఆర్ పేట, కొంపల్లి గ్రామాలలో కంకర, మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోడంతో ఈ తరలింపు మరింత జోరందుకుంది. ప్రభుత్వ చెరువులు, వాగులు, గెడ్డలను సైతం కొల్లగొట్టి మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఆదివారం అధికారులకు సెలవు కావడంతో మరింతగా అక్రమార్కుల రెచ్చిపోయి జెసిబిలతో మట్టిని పెకిలించి తరలించేస్తున్నారు. ఈ విషయంపై తహాశీల్దార్‌ను వివరణ కోరగా గ్రామ రెవెన్యూ అధికారులను పంపించి మట్టి తవ్వకాలను నిలుపుదల చేస్తామని చెప్పారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కొత్తవలస : మండలంలోఇన కంటకాపల్లి పంచాయతీ పరిధిలో, రెల్లి కాలనీలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆదివారం వైసిపి నాయకులు పిఎస్ఎల్ పాత్రుడు, అప్పలరమణ రూ. 4వేలు నగదు, 15 కిలోల బియ్యం అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామిన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పి. శ్రీనివాసరావు, పి.రాజేష్, ఎల్ఎస్ పాత్రుడు, పి. రావాలు, పి. నాగేశ్వరరావు, పి.అప్పలరాజు, ఎల్. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వాకర్స్

ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

విజయనగరం టౌన్ : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగాపై శ్రద్ధ చూపాలని శ్రీసాయికృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసరావు (రమణ) సూచించారు. ఆ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న వాకర్స్ నడక మైదానంలో ఆదివారం సీనియర్ సభ్యులు నడుపూరు వెంకట రమణ పుట్టినరోజు సందర్భంగా పిజి స్టార్ హాస్పిటల్ సహకారంతో బిపి, షుగర్ పరీక్షల శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆరోగ్యం బాగుంటే సమాజం బాగుంటుందన్నారు. ఈ శిబిరం 60 మందికి డాక్టర్ ఎ.కామేశ్వరరావు, లాబ్ టెక్నీషియన్ కాంత, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ అభిషేక్ సేవలందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోట్ల సత్యనారాయణ, కోశాధికారి జి.గోవిందరావు, ఉపాధ్యక్షులు వై.నలమారాజు, వాకర్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్-102, మాజీ గవర్నర్లు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, యడ్ల గణేష్, డిప్యూటీ గవర్నర్ పతివాడ నారాయణరావు, క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు పాల్గొన్నారు.

రజనీకాంత్‌కు సన్మానం

సాలూరు : ఉపాధ్యాయునిగా, రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకునిగా విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న డాక్టర్ రంభ రజనీకాంత్‌ను నవోదయ యువజన సేవాసమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. శనివారం సాయంత్రం నవోదయ సేవాసమితి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సన్మానించారు. పేదవిద్యార్థులకు ఆటో రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు 23ఏళ్లుగా రామానుజన్ మేథ్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్న రజనీకాంత్ సేవలకు గుర్తింపుగా 17వ వార్డు కౌన్సిలర్ గుల్లిపిల్లి నాగేశ్వరరావు, నవోదయ పాఠశాల కరస్పాండెంట్ గుల్లిపిల్లి రాజగోపాల్ రజనీకాంత్‌ను సన్మానించారు.

నేడు స్పందన రద్దు

సీతంపేట : ప్రతి సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ఈ సోమవారం రద్దు చేస్తున్నట్టు పిఒ బి.నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కావున ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీకారం

సాలూరు : పట్టణంలోని వెలంపేట రామమందిరం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలకు ఆదివారం స్థానిక పెద్దలు శ్రీకారం చుట్టారు. నవోదయ సేవాసమితి, యువజన సేవా సమితి ఆధ్వర్యాన గత 36ఏళ్లుగా శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వెలంపేట యువనాయకులు గుల్లిపిల్లి రవి దంపతులు ముహూర్తపురాట వేసి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నవోదయ సేవా సమితి పెద్దలు జి.రాజగోపాల్, జి.నాగేశ్వరరావు,చొక్కాపు గోపి పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులతో సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చిన పార్కులోని అందాలను ఆశ్వాదించారు. యువకులు బోటు షికారు చేసి ఉల్లాసం చేశారు. యువతీ యువకులు హ్యాంగ్ బ్రిడ్జిపై నడిచారు. ఆనంద విహార వద్ద నృత్యాలు చేశారు. మరి కొంతమంది స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చుట్టుముట్టారు. జెయింట్ వీల్ ఎక్కి ఆకాశంలో ఉయ్యాల ఊగారు. అనంతరం మెట్టుగూడ గూడ జలపాతాన్ని జరిపోతాను సందర్శించారు.

14న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- కురుపాం

ఈనెల 14న మంగళవారం మండల పరిషత్ సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వివి శివరామప్ప తెలిపారు. ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో గల మండల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. అలాగే సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కూడా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

- నదీ పరివాహక ప్రాంతాల్లో మరింత జోరందుకున్న వ్యాపారం
- పగలు నాటుబళ్లతో తరలింపు
- పట్టించుకోని యంత్రాంగం

ప్రజాశక్తి- గుర్ల, నెల్లిమర్ల

ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోంది. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అడపాదడపా చర్యలు తీసుకుంటున్నా ఎక్కడా రవాణా మాత్రం ఆగడం లేదు. మరికొన్ని చోట్ల రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరించడం, ఇంకొన్ని చోట్ల అక్రమార్కులతో యంత్రాంగం కలిసిపోవడంతో ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. రాత్రిపూట చంపావతి నదిలో దిగి తవ్వేసిన ఇసుకను నాటుబళ్లు, టైరు బళ్ల ద్వారా ఒడ్డుకు చేర్చి సమీప తోటల్లో డంప్ చేస్తున్నారు. తరువాత ఆ ఇసుకను సుదూర ప్రాంతాలకు తరలించి వేలాది రూపాయలు సొమ్ముచేసుకుంటున్నారు. ఇతంతంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి నెలవారీగా మామూళ్లు ఇస్తున్నట్లు ట్రాక్టర్, లారీ యజమానులే చెబుతున్నారు.

గుర్ల మండలంలో చంపావతి నది పరివాహక ప్రాంతాలైన భూపాలపురం, నడుపూరు, ఆనందపురం, కోటగండ్రేడు, కొత్తపేట, కలవచర్ల, చింతలపేట గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ రీచ్‌లను కేటాయించక పోయినప్పటికీ అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు, అధికారుల అండదండలతో ఇసుకను కొల్లగొట్టేస్తున్నారు.



నెల్లిమర్ల: రామతీర్థం కూడలి సమీపంలో చంపావతి నది నుంచి ఇసుకను టైరు బళ్లతో తరలిస్తున్న అక్రమార్కులు

నది నుండి రవాణా చేస్తున్న ఇసుకను విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు తరలించడం వల్ల స్థానిక అవసరాలకు ఇబ్బందులు పడుతున్నామని గృహ నిర్మాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అధికారులు, అధికార పార్టీ నాయకులు కక్ష పూరిత చర్యలు తీసుకుంటారేమో అన్న భయంతో అక్రమ రవాణాపై మాట్లాడేందుకు ముందుకు రావడం లేదు.

తాగునీటి బోర్ల వద్దా తవ్వేస్తున్నారు...

నదీ పరివాహక ప్రాంతంలో తాగునీటి బోర్ల వద్ద కూడా ఇసుకను తవ్వేయడం వల్ల రానున్న వేసవిలో తాగునీటి కష్టాలు తప్పేటట్లు లేవని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కూడా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఇసుక అక్రమ రవాణా చేయడం వల్ల భూగర్భజలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నోరు మెదపని సచివాలయ ఉద్యోగులు

ఎటువంటి అనుమతులు లేకుండా వందలాది ట్రాక్టర్లు, లారీలు, నాటుబళ్లు నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే సచివాలయ సిబ్బంది కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. గ్రామాల్లో సచివాలయాల ముందు నుంచే వాహనాలు వెళుతున్న అడ్డుకోకపోడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నెల్లిమర్ల: చంపావతి నదీ పరివాహక ప్రాంతం జరజాపుపేట, మొయిద కాజ్‌వే, రామతీర్థం కాజ్‌వే, జూట్ మిల్ సమీపంలో వంతెన వద్ద ఇసుక తవ్వకాలు జరిపి నాటు బళ్లు, ద్విచక్ర వాహనాల ద్వారా తరలించి వేరే ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రుళ్ళు లారీల ద్వారా తరలిస్తున్నారు. మిల్ బ్రిడ్జి వద్ద నీటి పథకాల వద్ద కూడా మిని ఆటోలు, ఎడ్ల బళ్ళు ద్వారా ఇష్టానుసారంగా రవాణా జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. టైరుబండ్లు, ఆటోల ద్వారా ఇసుకను సమీప తోటల్లో నిల్వ చేసి రాత్రి వేళల్లో లారీల ద్వారా అమ్మకాలు జరిపి అక్రమార్కులు వేలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ అండదండలతో ఇసుక దందా జరుగుతున్నట్లు బహిరంగంగానే విమర్శల వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతన్నా ఇసుక అక్రమ రవాణాపై ఎస్ఇబి, పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం మాకెందుకులే అన్నట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు దారి తీస్తుందని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకొని మంచి నీటి పథకాల పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- జామి, ఎల్‌కోట, వేపాడ

జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఆమె ఆదివారం సాయంత్రం జామి, ఎల్‌కోట, వేపాడ మండలాల్లో పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. క్యూలైన్లు, పోడియం, ఇతర ఓటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటింగ్ వేగంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పక్క పక్క పోలింగ్ బూత్‌లు ఉన్నచోట, ఓటర్లుకు ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. క్యూలైన్లకు పక్కనే తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఓటర్లకు తగిన అవగాహన కల్పించేందుకు క్యూలైన్ల వద్ద నమూనా బ్యాలెట్ పేపర్లను ప్రదర్శించాలని చెప్పారు. ఎండ తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, టెంట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లు మినహా ఇతరులను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించవద్దని ఆదేశించారు. కెమేరాలకు పోలింగ్ కేంద్రంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు.



వేపాడ: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

బొబ్బిలి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం, మెంటాడ, దత్తిరాజేరు మండలాలలో 13 పోలింగ్ కేంద్రాలకు బొబ్బిలి తహాశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎన్నికల సిబ్బందికి ఆర్‌డిఒ పి.శేషశైలజ ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గంలో తొమ్మిది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బొబ్బిలిలో ఆరు, బాడంగిలో ఒకటి, రామభద్రపురంలో ఒకటి, తెర్లాంలో ఒకటి, దత్తిరాజేరులో ఒకటి, మెంటాడలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బొబ్బిలి పట్టణ, రూరల్‌లో 4,536 మంది, తెర్లాం మండలంలో 768 మంది, బాడంగి మండలంలో 729 మంది, రామభద్రపురం మండలంలోని 683 మంది ఓటర్లు ఉన్నారు.

పటిష్ట బందోబస్తు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డిఎస్‌పి బి.మోహనరావు తెలిపారు. ఎన్నికల బందోబస్తుపై ఆయన ఆదివారం మాట్లాడుతూ బొబ్బిలి సబ్ డివిజన్‌లో ఒక డిఎస్‌పి, 14 మంది సిఐలు, 21 మంది ఎస్ఐలు, 20 మంది ఎఎస్ఐలు, కానిస్టేబుల్స్ 105 మంది హోమ్ గార్డులు 95 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చీపురుపల్లి సబ్ డివిజన్‌లో ఒక ఎఎస్‌పి, ఒక డిఎస్‌పి 14 మంది సిఐలు, 21 మంది ఎస్ఐలు, 20 మంది ఎఎస్ఐలు కానిస్టేబుల్స్ 105 మంది, హోమ్‌గార్డుల 95మంది బందోబస్తు నిర్వహిస్తారన్నారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి



బొబ్బిలి: సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ శైషశైలజ

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

వేపాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పట్టభద్రులు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లును తహాశీల్దార్ కృష్ణంరాజు ఆదివారం పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందలూ లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించార. ఆయన వెంట టిడి సన్యాసినాయుడు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు స్వగ్రామం మొయిదలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. జరజాపుపేటలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు ఆధ్వర్యంలో జెండా ఎగురు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ అట్టాడ కనకారావు, వైస్ సర్పంచ్ మీసాల స్వామినాయుడు, యడ్ల కృష్ణ, దవల లక్ష్మణ్‌రావు, సచివాలయం కన్వీనర్ అట్టాడ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండల కేంద్రంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, ఎంపిపి డి. సత్యవంతుడు, కొత్తవలస ఎఎంసి చైర్మన్ ఎం. కస్తూరి, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, జిల్లా వైసిపి బిసి సెల్ అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ, మండల వైసిపి అధ్యక్షుడు ఎం. జగ్గుబాబు, నాయకులు బోజంకి శ్రీను, ఎన్ వెంకటరావు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: కేక్ కట్ చేసి పంచిపెడుతున్న ఎమ్మెల్సీ

మెంటాడ: మండలంలోని పిట్టాడలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, నాయకుల పొట్టంగి అచ్చుతరావు, కనిమెరక త్రినాథ, రత్నాకర్ నాయుడు, సర్పంచుల, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బయటపడ్డ విభేదాలు

బొబ్బిలి : వైసిపి ఆవిర్భావ దినోత్సవం రోజున పార్టీలో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఈ వేడుకలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వైసిపి పాత కార్యాలయంలో వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జిలు వేరువేరుగా జరిపారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, ఎంపిపి శంబంగి లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు వేణుగోపాలనాయుడు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వైసిపి జెండాను ఎగురవేశారు. పాత కార్యాలయంలో అసమ్మతి కౌన్సిలర్లు పి.ఉమా శంకర్, ఎస్.రామకృష్ణ బాబు, వార్డు ఇంచార్జిలు దిబ్బ గోపి, ఒమ్మి రామా రావు, వాడపల్లి మనోజ్ కుమార్, సిహెచ్ రాజ గోపాల్, కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. వైసిపి మైనార్టి సెల్ నాయకులు అన్వర్ భాష, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఖాన్ ఆధ్వర్యంలో అనాధశ్రమంలో ఈ వేడుకలను నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

పద్మశాలిల సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకుందామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుల జగ్గారపు శ్రీనివాసరావు అన్నారు. పద్మశాలి జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం థామస్‌పేట స్టేజ్ వద్ద నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గిడితురి రాము అధ్యక్షతన నిర్వహించిన సమావేవంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పద్మశాలిలందరూ ఒక తాటిపైకి వచ్చి సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. పద్మశాలి సంఘానికి 18 శాతం రిజర్వేషన్లు ఉన్నప్పటికీ రాజకీయంగా, సామాజికంగా ఇంకా వెనుకబడి ఉన్నామన్నారు.రిజర్వేషన్ కల్పించి అన్ని రంగాల్లో పద్మశాలి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెద్దల కమిటీ చైర్మన్ తెడ్లాపు వెంకటేశ్వర్లు, పూసపాటిరేగ అధ్యక్షులు, కె.బలరాం, జిల్లా కోశాధికారి కె.చిరంజీవి, రిటైర్డ్ ఎంపిడిఒ కె.గౌరీ శంకర్, తిప్పాన అప్పలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ వెంకటరమణ, ఎన్ రమణ , కె.సన్యాసిరావు, ఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగ్గారపు శ్రీనివాసరావు

ఆంగ్లం పట్ల భయం వీడాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యార్థులు ఆంగ్లం పట్ల భయం వీడాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామమూర్తి, వాసు కళాశాల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు అన్నారు. డెల్టా ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ఎసిఇపి టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లం పట్ల భయం వీడితే మంచి భవిష్యత్తు వుంటుందన్నారు. ఆంగ్లంపై భయం వీడితే అతి సులభంగా ఆంగ్లాన్ని నేర్చుకోవచ్చునన్నారు. ఆంగ్లంలో ప్రతిభ కనబరిస్తే ప్రపంచంలో ఎక్కడైనా విజయం సాదించగలమని చెప్పారు. కార్యక్రమంలో డెల్టా అధ్యక్షులు ఎం.విజయమోహన్, సభ్యులు పి.సత్యనారాయణ, కె. కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో నిర్వాహకులు

విజేతలకు బహుమతులు అందజేత

డెల్టా పరీక్షకు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 189 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షలో మొదట 10స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు, వాసు కళాశాల కరస్పాండెంట్ వాసుదేవరావు బహుమతులు అందజేసి ప్రశంస పత్రాలు, ఆంగ్లం గ్లామర్ పుస్తకాలు అందజేశారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు మహిళలపై దాడి

10 మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని నీలయ్యవలస గ్రామానికి చెందిన గొండేల సత్యంతో పాటు ఆయన అనుచరులు మరో 9 మంది పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన రీచి అన్నపూర్ణ ఇంటి ముంగట కొంతమంది చెత్త వేస్తున్నారు. ఈ విషయంపై తన కుమార్తె రీచి ఈశ్వరమ్మ (మడ్డువలస సచివాలయ హెల్త్ సెక్రటరీ) చెత్త వేస్తున్న వారిని ప్రశ్నించగా అన్నపూర్ణ, ఈశ్వరమ్మలు మహిళలని కూడా చూడకుండా అదే గ్రామానికి చెందిన గొండేల సత్యంతో పాటు ఆయన అనుచరులు దాడి చేశారు. దీంతో ఈశ్వరమ్మ వంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మహిళలపై దాడి చేస్తున్న గొండెల సత్యం

దుకాణాలు దగ్ధం

శృంగవరపుకోట : గుర్తు తెలియని వ్యక్తి పెట్టిన అగ్గి మంట వల్ల పట్టణంలోని సాయిబాబా గుడికి ఆనుకొని ఉన్న దుకాణ సముదాయానికి మంటలు అంటుకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయిబాబా గుడి వద్ద కుల్లి కోనేరులోకి వెళ్లే దారి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున మంట పెట్టారు. ఆ మంటలు వ్యాపించి పక్కనే పనికి రాకుండా పాడైపోయిన ఫ్రిజ్‌ల బాడీ విడిభాగాలకు అంటుకొని మంట వ్యాపించడంతో పక్కనే ఉన్న ఆటోమొబైల్, కిరాణా మెడికల్ షాపులకు మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు సకాలంలో అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేయటంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. దీంతో ఎటువంటి ఆస్తి నష్టం జరిగినప్పటికీ పొగ వల్ల దుకాణాలు నల్ల రంగులోకి మారాయి.



కాలిపోతున్న దుకాణాలు

ఓటు ఒక వజ్రాయుధం

జామి: భారత రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించిన ఓటు హక్కు ఒక వజ్రాయుధం లాంటిదని, దానిని ప్రతి ఒక్కరూ సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తలి గౌరినాయుడు అన్నారు. ఆదివారం జామి మండలం తాండ్రంగి గ్రామంలో గల ఏఐహెచ్ఆర్ఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మార్చి 13వ తేదీ సోమవారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్క పట్టబద్రుడు, ఉపాధ్యాయులు విచక్షణా జ్ఞానంతో, రాజకీయ పార్టీలు ఎరగా చూపిన తాయిలాలకు తలొగ్గకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై అవగాహన, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై అవగాహన కలిగిన ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేస్తే భవిష్యత్తులో ప్రజా, ప్రభుత్వ ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలపై చట్టసభల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్క పట్టభద్రులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.